సాక్షి అల్లూరి సీతారామరాజు జిల్లా

గురువారం । 23 । మే । 2024



నమో నారసింహ

నృసింహ జయంతి సందర్భంగా బుధవారం సింహగిరిపై నృసింహ హోమాన్ని వైభవంగా నిర్వహించారు.

8లో



ఘనంగా జలాభిషేకం

విశాఖ నగరం దొండపర్తిలోని ఎరుకుమాంబ అమ్మవారికి బుధవారం భక్తులు పెద్ద ఎత్తున జలాభిషేకం నిర్వహించారు.

8లో



కొనసాగుతున్న పొగమంచు

సాక్షి పాడేరు: ఏజెన్సీలో కొద్దిరోజులుగా పొగ మంచు దట్టంగా కురుస్తోంది. బుధవారం ఉదయం 8 వరకు మంచు తెరలు వీడలేదు.

న్యూస్‌రీల్

స్ట్రాంగ్ రూమ్‌ల పరిశీలన



స్ట్రాంగ్ రూమ్ వద్ద కలెక్టర్ విజయ సునీత, ఎస్పీ తుహిన్ సిన్హా, పాడేరు, అరకు ఆర్వోలు

సాక్షి పాడేరు: స్థానిక డిగ్రీ కళాశాలలో పాడేరు, అరకు అసెంబ్లీ ఈవీఎంల స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద భద్రతను జిల్లా ఎన్నికల అధికారి విజయ సునీత, ఎస్పీ తుహిన్ సిన్హా, పాడేరు, అరకు ఆర్వోలు భావన వశిష్ట, అభిషేక్, అడిషనల్ ఎస్పీ ధీరజ్ బుధవారం పరిశీలించారు. అనంతరం లాగ్ బుక్‌లో అధికారులందరూ సంతకాలు చేశారు. అనంతరం విజయసునీత మాట్లాడుతూ జిల్లాలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రాల ఉపరితలంపై ఎటువంటి డ్రోన్, వీడియో కెమెరాలతో ఫొటోలు, వీడియోల చిత్రీకరణ నిషేధించినట్టు తెలిపారు. ఈ విషయంలో నిబంధనలు అతిక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వారి వెంట గిరిజన సంక్షేమ శాఖ ఈఈ డీవీఆర్ఎం రాజు, డీఈ అనుదీప్, సీఐ నవీన్‌కుమార్ పాల్గొన్నారు.

చెట్ల నరికివేత ప్రాంతాల పరిశీలన

సాక్షి ఎఫెక్ట్..

కొయ్యూరు: చింతపల్లి డీఎఫ్‌వో సూర్యనారాయణపడాల్ బుధవారం మండలంలో పర్యటించారు.అటవీలో కలప మాయం కావడంపై మంగళవారం సాక్షిలో 'కంచే చేను మేస్తే' శీర్షికన ప్రచురితమైన కథనంపై ఆయన స్పందించారు. ఈ మేరకు సిబ్బందితో కలిసి ఆయన వైఎం సింగధార, కొయ్యూరు తదితర ప్రాంతాల్లో పర్యటించారు. చెట్లు నరికివేతకు గురైన ప్రాంతాలను పరిశీలించారు. వాటికి సంబంధించిన వివరాలను సేకరించారు.

ప్రారంభానికి సిద్ధంగా సెల్ టవర్



గొందివలసలో సెల్ టవర్

అరకులోయ రూరల్: మండలంలోని గొందివలసలో రూ.10లక్షలతో చేపట్టిన బీఎస్ఎన్ఎల్ టవర్ నిర్మాణం ప్రారంభానికి సిద్ధంగా ఉంది. దీనివల్ల ఆ గ్రామంతోపాటు చిన్నలబుడు పరిసర ప్రాంతాలకు సెల్ సేవలు అందుబాటులోకి రానున్నాయి.

ఇంటర్ విద్యార్థులకు తత్కాల్ అవకాశం

విశాఖ విద్య: ఇంటర్మీడియట్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలకు హాజరయ్యేందుకు తత్కాల్ అవకాశం కల్పించినట్లు ఆర్ఐవో పి.మురళీధర్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 24 నుంచి సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభమవుతున్నాయన్నారు. అయితే అనివార్య కారణాలతో ఫీజు చెల్లించలేని విద్యార్థులు తత్కాల్ విధానంలో గురువారం మధ్యాహ్నం 12 గంటల్లోపు నెట్ బ్యాంకింగ్ ద్వారా ఫీజు చెల్లించినట్లయితే పరీక్షలకు అనుమతిస్తామన్నారు.

'దయాల్‌బాగ్'లో ఆన్‌లైన్ కోర్సులు

ఆరిలోవ (విశాఖ): విశాలాక్షినగర్, దయాల్‌నగర్‌లోని దయాల్‌బాగ్ విద్యా సంస్థలో బి.కాం (ఆనర్స్), బీబీఏ కోర్సులను ఆన్‌లైన్ విధానంలో నిర్వహిస్తున్నట్లు సెంటర్ ఇన్‌చార్జి దక్షిణమూర్తి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇందులో చేరాలంటే ఇంటర్మీడియట్‌లో ఉత్తీర్ణత సాధించాలని, వయోపరిమితి లేదన్నారు. ఆసక్తి గల వారు ఈ నెల 25లోగా దరఖాస్తులు చేసుకోవాలన్నారు. వీటితో పాటు రెగ్యులర్ కోర్సులకు(ఆఫ్‌లైన్) కూడా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. 10వ తరగతి పూర్తి చేసిన వారు ఇంజినీరింగ్ ఎల్రక్టానిక్స్ కోర్సు(డిప్లమో)కు, ఇంటర్ బైపీసీ పూర్తి చేసిన వారు బ్యాచిలర్ ఆఫ్ ఒకేషనల్ కోర్సు(అగ్రికల్చర్ టెక్నాలజీ)కు దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. ఈ రెండు కోర్సులు మూడేళ్ల కాలపరిమితితో నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఆసక్తి ఉన్న వారు దయాల్‌బాగ్ నగర్‌లోని డీఈఈ సెంటర్/99633 40611కు సంప్రదించాలని ఆయన కోరారు.

గిరినాగు హల్‌చల్



దేవరాపల్లి (అనకాపల్లి) : మండలంలో గర్సింగి గ్రామంలో గిరినాగు హల్‌చల్ చేసింది. బుధవారం రంసాల ఈశ్వరావు ఇంటిలోకి చొరబడుతుండగా,స్థానికులు కర్రలతో కొట్టి హత మార్చారు.

కోటి ఆశలతో.. సాగుకు సమాయత్తం

జిల్లాలోని విలీన మండలాల్లో సాగు పరిస్థితి భిన్నంగా ఉంటుంది. వేలాది ఎకరాలను సస్యశ్యామలం చేసే గోదావరి నది శాంతిస్తేనే ఎటపాక, కూనవరం, చింతూరు, వీఆర్‌పురం మండలాల్లో రైతులకు పంట చేతికందేది. ఏమాత్రం ఉగ్రరూపం దాల్చినా ఆశలు వదులుకోవాల్సిందే.

- వ్యవసాయ పనుల్లో నిమగ్నమైన విలీన మండలాల రైతులు
- ముమ్మరంగా వేసవి దుక్కులు
- రెండేళ్లుగా వరదలు, చీడపీడలతో నష్టాలు
- ఈ ఏడాది గోదావరి కరుణిస్తేనే పంట చేతికందేది



వేసవి దుక్కిలో నిమగ్నమైన రైతు

ఎటపాక: ఖరీఫ్ సాగుకు అన్నదాతలు సమాయత్తమవుతున్నారు. గత రెండేళ్ల నుంచి ఎన్నో కష్టనష్టాలను చవిచూసినప్పటికీ ఈఏడాది పంటల సాగుపై రైతన్నలు ఎంతో ఆశగా ముందుకు సాగుతున్నారు. తొలకరి పలకరింపునకు ఎదురుచూస్తూ వేసవి దుక్కుల్లో నిమగ్నమయ్యారు. ఇప్పటికే నైరుతి రుతుపవనాల రాకతో వ్యవసాయానికి వాతావరణ పరిస్థితులు అనుకూలిస్తాయని ఆశిస్తున్నారు. పత్తి, వరి విత్తనాల సేకరణపై దృష్టిసారించారు. అయితే గత ఏడాది గోదావరి వరదల కారణంగా మిగిల్చిన నష్టంతో కొందరు రైతులు సాగుకు సందిగ్ధంలో ఉన్నారు.

విలీన మండలాలైన చింతూరు, ఎటపాక, కూనవరం, వీఆర్‌పురం మండలాల్లో సుమారు 16 వేల హెక్టార్లలో రెండు వేల మంది రైతులు వివిధ రకాల పంటలను సాగు చేస్తున్నారు. వీటిలో వరి పత్తి, మిర్చి పంటలను అత్యధికంగా సాగు చేస్తున్నారు.

గోదావరి వరదలతో..

గోదావరి వరదలు ఓపక్క మిర్చి పంటకు చీడపీడలు మరోపక్క ఈరెండు కారణాలతో గత రెండేళ్ల నుంచి అన్నదాతలు తీవ్ర నష్టాలు చవిచూస్తున్నారు. 2022 గోదావరి వరదలు ఎటపాక, కూనవరం, వీఆర్‌పురం మండలాల రైతులను కోలుకోలేని విధంగా దెబ్బతీసింది. మిర్చి తోటలపై తామర పురుగు, నల్లి ప్రభావంతో దిగుబడులు తగ్గి ఆదాయం కోల్పోయారు. అయితే గత ఏడాది కూడా వాతావరణ ప్రభావంతో మిర్చి తోటలు ప్రారంభంలోనే పాడవడంతో రైతులు దిగుబడులపై ఆశలు వదులుకోవాల్సి వచ్చింది. దీంతో సాగుకు చేసిన అప్పులు, ఎరువులు, పురుగు మందుల దుకాణాల్లో చెల్లింపులు కూడా చేయలేని దుస్థితి నెలకొంది. అంతే కాకుండా గత ఏడాది భూములకు కౌలు కూడా చెల్లించకపోవడంతో చాలా మంది రైతులు ఈ ఏడాది సాగుకు దూరమవుతున్నారు. ఈ పరిణామాలతో సాగు విస్తీర్ణం గణనీయంగా తగ్గే పరిస్థితులు కనిపిస్తున్నాయి.

సాగు విస్తీర్ణం (హెక్టార్లలో)

	వరి	పత్తి	అపరాలు	మిర్చి
చింతూరు	3844	148	1143	44
ఎటపాక	1566	1750	100	2000
కూనవరం	1658	450	130	453
వీఆర్‌పురం	1492	126	895	149

ఎన్ని కష్టనష్టాలు ఎదురైనా..

ఎన్ని కష్టనష్టాలు వచ్చినా ఈ ప్రాంత రైతులు వ్యవసాయం మాత్రమే చేసేందుకు ప్రయత్నిస్తారు. ఈక్రమంలోనే వ్యవసాయశాఖ సూచనల మేరకు వేసవి దుక్కులు చేపట్టారు. దీనివల్ల చీడపీడలు, కలుపు నివారణతో పాటు భూసారం పెరుగుతుందని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. దుక్కి చేయకుంటే భూమి సారం కోల్పోయి చీడపీడలకు ఆవాసంగా మారుతుంది. దీంతో ముడిపోషకాల లోపం ఏర్పడి ఎక్కువగా ఎరువులు వేయాల్సి వస్తుంది. వీటి నివారణకు రైతులు వేసవిలో లోతు దుక్కులు మీద దృష్టి పెట్టాలని అధికారులు చెబుతున్నారు.

విత్తనాల పంపిణీకి ఏర్పాట్లు



రైతులు లోతైన వేసవి దుక్కులు తప్పనిసరిగా చేసుకోవాలి. పంట మార్పిడితో భూమికి మేలు జరుగుతుంది. ఈ ఏడాది ఆర్‌బీకేల ద్వారా రైతులకు విత్తనాల పంపిణీకి ఏర్పాట్లు చేస్తున్నాం.650 క్వింటాళ్ల వరి, 150 క్వింటాళ్ల మినుము విత్తనాలు అవసరమని ప్రభుత్వానికి నివేదించాం. సకాలంలో రైతులకు అందజేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

– రాబిన్ సుదర్శన్, మండల వ్యవసాయాధికారి, ఎటపాక



గిరి గ్రామదర్శినిలో దర్భ గడ్డితో గుడిసెలు



రాగులను దంచుతున్న గిరి మహిళ

ప్రకృతితో మమేకం.. జీవనంలో వైవిధ్యం

గిరిజనుల జీవనశైలి వైవిధ్యంగా ఉంటుంది. ప్లాస్టిక్, పాలిథిన్ వినియోగానికి దూరంగా ఉంటూ.. సంప్రదాయ వనరుల వినియోగానికి ప్రాధాన్యమిస్తున్నారు. పర్యావరణ పరిరక్షణలో కీలకపాత్ర పోషిస్తున్నారు. వ్యవసాయ పనులకు...పంట ఉత్పత్తులను తరలించేందుకు వెదురుతో తయారుచేసిన తట్టలు, బుట్టలను వినియోగిస్తున్నారు. వంటకు.. నీరు నిల్వ చేసేందుకు మట్టి పాత్రలను వాడుతున్నారు. ఇప్పటికీ చాలా గ్రామాల్లో నీటిని తాగేందుకు ఆనపకాయ డిప్పలను ఉపయోగిస్తున్నారు. వెదురుబొంగులో చికెన్ వండుకుని తినేందుకు ప్రాధాన్యమిస్తున్నారు. అటవీశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అరకు పైనరీ, చిలకలగెడ్డ ఎకో పార్కులు వారి జీవనశైలికి అద్దంపడుతున్నాయి. కలపతో తయారు చేసిన డైనింగ్ టేబుళ్లు.. పర్యాటకులు కూర్చునేందుకు వీలుగా ఉడ్ వెదురుతో కుర్చీలు రూపొందించి ఏర్పాటుచేశారు. పర్యావరణానికి మేలు చేసేలా గిరి గ్రామదర్శినిని తీర్చిదిద్దారు. ఇక్కడ కలపతో తయారుచేసిన వస్తువులు, మట్టిపాత్రలు మాత్రమే కనిపిస్తాయి. పద్మాపురం గార్డెన్‌లో చెక్కతో కాటేజీలు, హట్స్‌లో డైనింగ్ టేబుళ్లను విభిన్నంగా ఏర్పాటుచేశారు.

– అనంతగిరి





పద్మాపురం గార్డెన్‌లో వుడెన్ కాటేజీలు, పర్యాటకుల కోసం కలప డైనింగ్ టేబుల్



కాశీపట్నం వారపు సంతకు వెదురు బుట్టలతో తీసుకువచ్చిన వంకాయలు

మళ్లీ జగనన్నే ముఖ్యమంత్రి

ఉమ్మడి విశాఖ జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర



మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర, శోభ హైమావతి, శోభ స్వాతిరాణి, చెట్టివినయ్

అనంతగిరి: జగనన్న మళ్లీ ముఖ్యమంత్రి అవ్వడం ఖాయమని అరకు నియోజకవర్గ ఎన్నికల పరిశీలకులు, ఉమ్మడి విశాఖ జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర, శోభ హైమావతి, జీసీసీ చైర్‌పర్సన్ శోభ స్వాతిరాణి, యువజనవిభాగం రాష్ట్ర కార్యదర్శి చెట్టి వినయ్ అన్నారు. మండలంలోని గుమ్మకోట పంచాయతీ భీమవరంలో బుధవారం పార్టీ నాయకులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఐదేళ్లలోనే గిరిజన ప్రాంతం ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. మారుమూల గ్రామాలను కలుపుకుంటూ రోడ్లు, గెడ్డలపై వంతెనలు, గ్రామాల్లో తాగునీటి పథకాలు, సీసీ రోడ్లు, డ్రైనేజీలు నిర్మించిందన్నారు. పంచాయతీ కేంద్రాల్లో పాలన సులభతరం చేసేలా సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, ప్రభుత్వ ఆస్పత్రులను కార్పొరేట్‌కు దీటుగా తీర్చిదిద్దినట్టు చెప్పారు. గతంలో ఏ ప్రభుత్వాలు కనీసం గిరిజన ప్రాంతం అభివృద్ధిని పట్టించుకోలేదని విమర్శించారు. ఓ వైపు సంక్షేమం, మరోవైపు అభివృద్ధికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అధిక ప్రాధాన్యమిచ్చారన్నారు. ఎన్నికల ఫలితాలు అనంతరం విశాఖపట్నంలో జగనన్న ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేస్తారని తెలిపారు. గ్రామంలో గంగమ్మతల్లి పండగ సందర్భంగా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ శోభ సోమేశ్వరి, మండల పార్టీ అధ్యక్షుడు రేగబోయిన స్వామి, సర్పంచ్‌లు పాగి అప్పారావు, సన్యాసిరావు, కన్వీనర్ నవీన్ పాల్గొన్నారు.

దెబ్బతిన్న పాఠశాల భవనాలకు తక్షణ మరమ్మతులు

జిల్లా విద్యాశాఖాధికారి బ్రహ్మాజీరావు



సంగడలో ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న జిల్లా విద్యాశాఖాధికారి బ్రహ్మాజీరావు

ముంచంగిపుట్టు: వర్షాలకు దెబ్బతిన్న పాఠశాలలకు తక్షణ మరమ్మతులకు చర్యలు తీసుకుంటున్నామని జిల్లా విద్యాశాఖాధికారి పి.బ్రహ్మాజీరావు అన్నారు. మండలంలోని వనుగుమ్మ పంచాయతీ సంగడ గ్రామంలో ఇటీవల వర్షాలకు దెబ్బతిన్న జీపీఎస్ పాఠశాల పైకప్పును బుధవారం ఆయన పరిశీలించారు. పాఠశాల భవనం పైకప్పుతో పాటు తక్షణ మరమ్మతులకు ప్రతిపాదనలు పంపితే అవసరమైన నిధులు మంజూరు చేస్తామని ఎంఈవో కృష్ణమూర్తికి సూచించారు. అనంతరం సంగడలోని ఎంహెచ్ఈపీ హైస్కూల్‌ను సందర్శించారు. గత విద్యా సంవత్సరంలో విద్యార్థుల హాజరు పట్టీలు, ల్యాండ్ రికార్డులు, ఉపాధ్యాయుల హాజరును పరిశీలించారు. అనంతరం స్థానిక విద్యాశాఖ కార్యాలయంలో జేవీకే కిట్ల స్టాక్‌పాయింట్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూన్‌లో పాఠశాలల పునః ప్రారంభం నాటికి విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలు కల్పించేలా ఉపాధ్యాయులకు ఆదేశాలు జారీ చేశామన్నారు. విద్యార్థులు పాఠశాలలకు వచ్చే సరికి పాఠ్యపుస్తకాలు సైతం సిద్ధం చేస్తున్నామని తెలిపారు. సీఆర్‌పీ భాస్కర్, ఎంఆర్‌పీ సిబ్బంది పాల్గొన్నారు.

మొరాయిస్తున్న బస్సులు

ప్రయాణికుల అవస్థలు



పాడేరు ఘాట్‌లో డైమండ్ పార్కు వద్ద నిలిచిపోయిన ఆర్టీసీ బస్సు వద్ద ప్రయాణికుల పడిగాపులు



కేజేపురం సమీపంలో నిలిచిపోయిన పాడేరు ఆర్టీసీ డిపో బస్సు

సాక్షి పాడేరు: స్థానిక ఆర్టీసీ డిపోకు చెందిన రెండు ఆర్టీసీ బస్సులు సాంకేతిక లోపం కారణంగా వేర్వేరు ప్రాంతాల్లో నిలిచిపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. పాడేరు నుంచి విశాఖపట్నం వెళ్లన్న ఎక్స్‌ప్రెస్ సర్వీసు పాడేరు ఘాట్‌లోని డైమండ్ పార్కు వద్ద బుధవారం నిలిచిపోయింది. దీంతో ప్రయాణికులు సుమారు గంట పాటు ఇబ్బందులకు గురయ్యారు. పాడేరు నుంచి చోడవరం వెళ్లే ఎక్స్‌ప్రెస్ సర్వీసు కూడా అనకాపల్లి జిల్లా వి.మాడుగుల మండలం కేజేపురం సమీపంలో మరమ్మతులకు గురై నిలిచిపోయింది. కాలం చెల్లిన బస్సులను నడపడంతో తరచూ మొరాయిస్తున్నాయని ప్రయాణికులు ధ్వజమెత్తుతున్నారు.

క్లుప్తంగా

ఘనంగా జలాభిషేకం



అమ్మవారి దర్శనం కోసం క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులు

సీతమ్మధార (విశాఖ) : బుధవారం దొండపర్తిలోని ఎరుకుమాంబ అమ్మవారికి భక్తులు పెద్ద ఎత్తున జలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు దొండపర్తి, నెహ్రూబజార్, రైల్వేన్యూకాలనీ, పెదవాల్తేరు, మద్దిలపాలెం, అక్కయ్యపాలెం, శివాజీపాలెం, ఎస్‌ఏడీ, సీతమ్మధార, నక్కవానిపాలెం, రేసవానిపాలెం, జగదాంబ, వన్‌టౌన్ తదితర ప్రాంతాల నుంచి భక్తులు తరలి వచ్చారు. ప్రధాన అర్చకులు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పంచామృతాభిషేకంతో పాటు అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపారు. అలాగే సాయంత్రం కూడా భక్తులు అమ్మవారికి జలాభిషేకం చేశారు. పలు రకాల పూలతో అమ్మవారిని అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు అంతరాలయ దర్శనం రద్దు

సింహాచలం: వైశాఖ పౌర్ణమిని పురస్కరించుకుని గురువారం ఆలయ అంతరాలయ దర్శనం రద్దు చేశామని సింహాచలం దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి తెలిపారు. రూ.300 టికెట్టు తీసుకునే భక్తులకు కూడా నీలాద్రిగుమ్మం వద్ద నుంచి లఘు దర్శనం ఉంటుందని, భక్తులంతా ఈ విషయాన్ని గమనించాలని సూచించారు. భక్తులకు త్వరితగతిన స్వామి దర్శనం కల్పించాలన్న ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. సింహగిరిపై దేవస్థానం నిర్దేశించిన ప్రాంతాల్లో మాత్రమే వాహనాలను పార్కింగ్ చేయాలన్నారు. ద్విచక్ర వాహనాలను సింహగిరిపై గజపతి సత్రం వద్ద ఏర్పాటు చేసిన పార్కింగ్ ప్రదేశంలో మాత్రమే నిలపాలన్నారు.

ట్రాక్టర్ విడిభాగాల చోరీ

రోలుగుంట : రోలుగుంట మండల కేంద్రం పరిసరాల్లో గల సహస్ర స్టోన్ క్రషర్ వద్ద గల ట్రాక్టర్ల విడిభాగాలు గత కొన్ని నెలలుగా వరుస చోరీలు జరుగుతున్నాయి. రోలుగుంట గ్రామానికి చెందిన బణికల దేముడు ఈ స్టోన్ క్రషర్ నుంచి మెటీరియల్ తరలించే పని ఉండడంతో క్రషర్ వద్ద ట్రాక్టర్ వదిలి ఊళ్లోకి వచ్చేశాడు. ఉదయం వెళ్లి చూడగా ట్రాక్టర్‌కు ఉన్న హెడ్ లైట్, ఫ్యాన్, బ్యాటరీ చోరీకి గురైనట్టు గర్తించాడు. దీంతో బాధితుడు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు ఎస్‌ఐ ఎల్.సురేష్ సిబ్బందితో సంఘటన స్థలానికి వచ్చి ట్రాక్టర్‌ను, పరిసరాలను పరిశీలించారు. చోరీపై పూర్తిస్థాయిలో విచారణ చేసి దొంగలను పట్టుకుంటామని పోలీసులు తెలిపారు.

నమో నారసింహ



హోమంలో పాల్గొన్న భక్తులు



హోమాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

- సింహగిరిపై వైభవంగా శ్రీనృసింహ హోమం
- తొలిసారిగా ఆలయ ఉత్తర రాజగోపురం ఎదురుగా పెద్ద ఎత్తున నిర్వహణ
- స్వామి సేవలో తరించిన ఉభయదాతలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామి జన్మనక్షత్రం స్వాతి నక్షత్రం, నృసింహ జయంతి సందర్భంగా బుధవారం సింహగిరిపై నృసింహ హోమాన్ని వైభవంగా నిర్వహించారు. తొలిసారిగా ఆలయ ఉత్తర రాజగోపురం ఎదురుగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో సుమారు 250 మంది ఉభయదాతలు పాల్గొన్నారు. నృసింహ నామస్మరణలో భక్తులు మునిగి తేలారు. ఉదయం 8 గంటలకు ప్రారంభమైన ఈ కార్యక్రమంలో ముందుగా చక్రపెరుమాళ్, స్వామి ఉత్సవమూర్తులు గోవింద రాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేర్వేరు పల్లకీల్లో.. వేద మంత్రోచ్ఛరణలు, మంగళవాయిద్యాల మధ్య ఆలయంలోంచి ఊరేగింపుగా హోమ ప్రాంగణానికి తీసుకొచ్చారు. స్వామి ఉత్సవమూర్తులను వేదికపైన, చక్రపెరుమాళ్లను హోమగుండం వద్ద అధిష్టింపజేశారు. యాగంలో పాల్గొన్న ఉభయదాతలకు కంకణధారణ చేసి ఆశీనింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవాచనం, కలశారాధన, అగ్ని కార్యం చేశారు. అనంతరం నృసింహ హోమాన్ని విశేషంగా నిర్వహించారు. యాగంలో పాల్గొన్న ఉభయదాతలందరిచేత స్వామి అష్టోత్తరనామావళిని పఠింపజేశారు. అనంతరం పూర్ణాహుతి, కుంభ ప్రోక్షణ కార్యక్రమాన్ని విశేషంగా చేపట్టారు. హోమంలో ఉంచిన ప్రధాన కలశాన్ని ప్రధానార్చకుడు గొడవరి శ్రీనివాసాచార్యులు శిరస్సుపై పెట్టుకుని తిరువీధిగా ఆలయంలోకి తీసుకెళ్లి.. స్వామి మూలవిరాట్‌కి సమర్పించారు. అనంతరం ఆ జలాలను యజ్ఞశాలకు తీసుకొచ్చి భక్తులపై చల్లారు. దేవస్థానం తరఫున ఉభయదాతలకు స్వామి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు. ప్రిలిగ్రిమ్స్ సెంటర్‌లో భోజనం సదుపాయం కల్పించారు. దేవస్థానం అనువంశిక ధర్మకర్త పూసపాటి అశోక్‌గజపతిరాజు దంపతులు, ట్రస్ట్‌బోర్డు మాజీ సభ్యులు పాల్గొన్నారు. దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఆలయ స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ప్రధాన అర్చకులు ఇరగవరపు రమణాచార్యులు, పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు, అర్చకులు, పారాయణదారులు, వేదపండితులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.



పూర్ణాహుతి నిర్వహిస్తున్న అర్చకులు

జీతాలపై యాజమాన్య వైఖరి మారాలి

- ఉక్కు యాజమాన్యంతో కార్మిక సంఘాల భేటీ
- 23న మిగిలిన సగం జీతం చెల్లించేందుకు హామీ



సమావేశంలో పాల్గొన్న సీఎండీ, డైరెక్టర్లు, కార్మిక సంఘాల నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ఉద్యోగుల జీతాల చెల్లింపులో ఆరు మాసాలుగా యాజమాన్యం అవలంబిస్తున్న వైఖరి మార్చుకోవాలని ఉక్కు కార్మిక సంఘాల నాయకులు యాజమాన్యానికి స్పష్టం చేశారు. జీతాల చెల్లింపుపై యాజమాన్యం వైఖరికి నిరసనగా అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు బుధవారం డెడికేషన్ పార్కులో సమావేశమయ్యారు. అక్కడ తీసుకున్న నిర్ణయం మేరకు సుమారు 30 మంది ఉక్కు అడ్మిన్ బిల్డింగ్‌కు వెళ్లారు. అప్పటికే అక్కడ పెద్ద ఎత్తున మోహరించిన పోలీసులు వారిని లోపలికి పంపేందుకు నిరాకరించారు. దీంతో నాయకులకు, పోలీసులకు మధ్య కాసేపు వాగ్వాదం నెలకొంది. ఆ తర్వాత వారిని లోపలికి పంపారు. ఉక్కు సీఎండీ కాన్ఫరెన్స్ హాలులో జరిగిన సమావేశంలో నాయకులు యాజమాన్యం తీరును ఎండగట్టారు. ప్లాంట్ ఉత్పత్తి, ఉత్పాదకతలో కీలకంగా ఉన్న ఉద్యోగులకు జీతాల చెల్లింపులో నిర్లక్ష్యం సరికాదన్నారు. జీఎస్టీ, విద్యుత్ బిల్లులు, ముడి పదార్థాల చెల్లింపులకు ఇచ్చే ప్రాధాన్యత జీతాల చెల్లింపునకు ఇవ్వరా? అని ప్రశ్నించారు. దీంతో సీఎండీ అతుల్ భట్ మాట్లాడుతూ యాజమాన్యం కావాలని జీతాల చెల్లింపుల్ని జాప్యం చేయలేదని, అనివార్య పరిస్థితుల వల్ల అలా జరుగుతోందన్నారు. గురువారం మిగిలిన సగం జీతం చెల్లిస్తామని హామీ ఇచ్చారు. ఎన్ఎండీసీతో ఒప్పందం జరిగితే ఆర్థికంగా కొంత వెసులుబాటు కలుగుతుందన్నారు. బార్స్ కమిటీ నివేదికపై జూన్ 1 నాటికి తుది నిర్ణయం తీసుకుంటామన్నారు. ఈలోగా ఒక మెడికల్ పర్మిషన్ ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అఖిలపక్ష నాయకులు డి.ఆదినారాయణ, కేఎస్ఎన్ రావు, మంత్రి రాజశేఖర్, నీరుకొండ రామచంద్రరావు, జె.అయోధ్యరామ్, యు.రామస్వామి, రామ్మోహన్‌కుమార్, దొమ్మేటి అప్పారావు, సన్యాసిరావు, కామేశ్వరరావు, వరసాల శ్రీనివాస్, డేవిడ్, శ్రీనివాసనాయుడు, నమ్మి సింహాద్రి, పల్లా పెంటారావు తదితరులు పాల్గొన్నారు.

మరికొన్ని రైళ్లకు ఎల్‌హెచ్‌బీ కోచ్‌లు

తాటిచెట్లపాలెం: ప్రయాణికులకు మరింత సౌకర్యవంతమైన ప్రయాణాన్ని అందించేందుకు వాల్తేర్ డివిజన్ పరిధిలో పలు రైళ్లకు అత్యాధునిక ఎల్‌హెచ్‌బీ కోచ్‌లను జతచేస్తున్నట్లు సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ కె.సందీప్ తెలిపారు. ఈ నెల 24 నుంచి విశాఖపట్నం-ఎంజీఆర్ చెన్నై సెంట్రల్(22801) వీక్లీ ఎక్స్‌ప్రెస్, 25 నుంచి ఎంజీఆర్ చెన్నై సెంట్రల్-విశాఖపట్నం(22802) వీక్లీ ఎక్స్‌ప్రెస్, 26 నుంచి విశాఖపట్నం-పారాదీప్(22810) వీక్లీ ఎక్స్‌ప్రెస్, 27 నుంచి పారాదీప్-విశాఖపట్నం(22809) వీక్లీ ఎక్స్‌ప్రెస్, 28 నుంచి విశాఖపట్నం-కర్నూల్ టౌన్ (08585) సమ్మర్ స్పెషల్ ఎక్స్‌ప్రెస్, 29 నుంచి కర్నూల్ టౌన్-విశాఖపట్నం(08586) సమ్మర్‌స్పెషల్ ఎక్స్‌ప్రెస్‌కు ఎల్‌హెచ్‌బీ కోచ్‌లను జతచేయనున్నారు.

పలు రైళ్ల రీ షెడ్యూల్

తాటిచెట్లపాలెం: పలు పెయిరింగ్ రైళ్లు ఆలస్యంగా చేరిన కారణంగా.. ఆయా స్టేషన్ల నుంచి రైళ్లు ఆలస్యంగా బయలుదేరినట్లు రైల్వే అధికారులు తెలిపారు. బుధవారం ఉదయం 10.35 గంటలకు ఎస్ఎంవీ బెంగళూరులో బయలుదేరాల్సిన ఎస్ఎంవీ బెంగళూరు-హౌరా(12864) ఎక్స్‌ప్రెస్ సుమారు గంటన్నర ఆలస్యంగా మధ్యాహ్నం 12 గంటలకు బయల్దేరింది. రాత్రి 8గంటలకు విశాఖపట్నంలో బయలుదేరాల్సిన విశాఖపట్నం-నాందేడ్ (20811) ఎక్స్‌ప్రెస్ సుమారు గంటన్నర ఆలస్యంగా రాత్రి 9.30 గంటలకు బయల్దేరింది. రాత్రి 11.20 గంటలకు విశాఖపట్నంలో బయలుదేరాల్సిన విశాఖపట్నం-లోకమాన్యతిలక్ టెర్మినస్(18519) ఎల్టీటీ ఎక్స్‌ప్రెస్ సుమారు గంట ఆలస్యంగా మధ్యరాత్రి 12.20 గంటలకు బయల్దేరింది.

దారి మళ్లింపు

తిరుపతి-కాట్పడి సెక్షన్ పరిధి బొమ్మ సముద్రం స్టేషన్ వద్ద జరుగుతున్న లూప్‌లైన్ పనుల కారణంగా ఈ మార్గంలో ప్రయాణించే పలు రైళ్లను దారి మళ్లిస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ కె.సందీప్ తెలిపారు. ఈ నెల 27న ఎస్ఎంవీ బెంగళూరు-టాటానగర్(12890) ఎక్స్‌ప్రెస్, 28, 30వ తేదీల్లో ఎస్ఎంవీ బెంగళూరు-హతియా(12836) ఎక్స్‌ప్రెస్ వయా కాట్పడి-మెల్పక్కం, రేణిగుంట మీదుగా నడుస్తాయి.

- ఖరగ్‌పూర్ డివిజన్ పరిధిలో జరుగుతున్న భద్రతా పనుల కారణంగా జూన్ 6న చెన్నై సెంట్రల్-న్యూ జల్పాయ్‌గురి(22611) ఎక్స్‌ప్రెస్ వయా టాటానగర్-పురూలియా-కోట్‌శిలా స్టేషన్ల మీదుగా నడుస్తుంది.

రూ.1.22 కోట్లతో వైద్య పరికరాలు

ప్రాంతీయ కంటి ఆస్పత్రికి హెచ్‌పీసీఎల్ వితరణ



విశాఖలో ప్రాంతీయ కంటి ఆస్పత్రిలో హెచ్‌పీసీఎల్ సమకూర్చిన మైక్రోస్కోప్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ మల్లికార్జున, చిత్రంలో హెచ్‌పీసీఎల్ ప్రతినిధులు

మహారాణిపేట: రోగులకు మెరుగైన, మరింత నాణ్యమైన వైద్య సేవలందించేలా ప్రభుత్వ ప్రాంతీయ కంటి ఆస్పత్రిలో అత్యాధునిక వైద్య పరికరాలు అందుబాటులోకి వచ్చాయి. ఇందుకు కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్సార్)లో భాగంగా హెచ్‌పీసీఎల్ సంస్థ రూ.1.22 కోట్ల సాయాన్ని వైద్యశాలకు అందించింది. ఈ మొత్తంతో సమకూర్చిన ఆధునిక వైద్య పరికరాలను జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున చేతుల మీదుగా బుధవారం ఆవిష్కరించి, అందుబాటులోకి తెచ్చారు. నిపుణుల సూచనల మేరకు ప్రస్తుత అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఫాకో మిషన్, ల్యూమిరా 300 స్టాండర్డ్ మైక్రోస్కోప్‌లు, హంఫెరీ విజువల్ ఫీల్డ్ అనలైజర్ తదితర పరికరాలను కొనుగోలు చేశారు. వైద్య పరికరాల పనితీరును జిల్లా కలెక్టర్ పరిశీలించారు. వాటి ప్రయోజనాలను, వినియోగ పద్ధతులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ ప్రాంతీయ కంటి ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వి.మీనాక్షి, ఆప్తమాలజీ విభాగాధిపతి డాక్టర్ టి.జ్యోతిర్మయి, ఆంధ్రా మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.బుచ్చిరాజు, హెచ్‌పీసీఎల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వి.రతన్ రాజ్, చీఫ్ జనరల్ మేనేజర్ జి.కిరణ్ కుమార్, కేజీహెచ్ అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాస్ కుమార్, వైద్యాధికారులు, వైద్యులు పాల్గొన్నారు.

క్రిమినల్ చట్టాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న మాజీ ఐజీ దామోదర్

సీతమ్మధార : దేశంలో నేర న్యాయ వ్యవస్థను పూర్తిగా మార్చేందుకు తీసుకోనున్న చర్యల్లో భాగంగా కొత్తగా ప్రవేశపెట్టిన భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక సురక్ష సంహిత, భారతీయ సాక్ష్యా అధినియం అనే మూడు క్రిమినల్ చట్టాలపై అందరూ అవగాహన పెంచుకోవాలని మాజీ ఐజీ ఈ.దామోదర్ అన్నారు. 'వార్తా ల్యాప్ ఆన్ త్రీ న్యూ క్రిమినల్ లాస్' అనే అంశంపై డైమండ్ పార్కు సమీపంలోని ఓ హోటల్‌లో బుధవారం కేంద్ర ప్రభుత్వ ఇన్ఫర్మేషన్ బ్రాడ్ కాస్టింగ్ (విజయవాడ)కు చెందిన పీఐబీ వర్క్ షాపు నిర్వహించింది. ఈ వర్క్ షాపులో ఆయన మాట్లాడుతూ ఈ మూడు చట్టాలు భారత శిక్షా స్మృతి (ఐపీసీ) 1860, క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ (సీఆర్‌పీసీ)1973, ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్ 1872లను రిప్లేస్ చేయనున్నాయని తెలిపారు. వాడుకలో ఉన్న సాంకేతికతకు అనుగుణంగా ఈ మూడు క్రిమినల్ చట్టాల్లో పలు కొత్త నిబంధనలను చేర్చినట్టు చెప్పారు. ఈ చట్టాలు నేరస్తులకు శిక్ష వేయడం కంటే బాధితులకు న్యాయం అందించడంపైనే దృష్టి పెడతాయన్నారు. వీటికి గత ఏడాది డిసెంబర్ 21న పార్లమెంట్ ఆమోదం లభించిందని, రాష్ట్రపతి ద్రౌపది ముర్ము గత ఏడాది డిసెంబర్ 25న అనుమతిచ్చారని తెలిపారు. బాధితులు తమకు జరిగిన అన్యాయంపై సంఘటన స్థలం నుంచి స్మార్ట్‌ఫోన్ ద్వారా ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేయవచ్చని, ఆ ఫిర్యాదు రికార్డు అవుతుందని చెప్పారు. నేరస్తులను విచారించేందుకు జ్యుడీషియల్ కస్టడీ కాలపరిమితి పెంచనున్నారని తెలిపారు. పెరిగిన టెక్నాలజీని నేరాల నియంత్రణకు ఉపయోగించుకోవాలని చెప్పారు. రోడ్డు ప్రమాదాల బాధితులను గోల్డెన్ అవర్‌లో ఆస్పత్రిలో చేర్పితే మరణాలను నివారించవచ్చునన్నారు. కొత్తగా ప్రవేశపెట్టిన ఈ చట్టాల ద్వారా బాధితులకు న్యాయ వ్యవస్థపై మరింత నమ్మకం కలుగుందని చెప్పారు. ఈ చట్టాల వల్ల పరిధితో సంబంధం లేకుండా సంఘటనా స్థలం నుంచే ఫిర్యాదు చేసి ఇ-ఎఫ్ఐఆర్ పొందవచ్చునన్నారు. ప్రజలకు దామోదర సంజీవయ్య నేషనల్ లా యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ సి.పి.నందిని మాట్లాడుతూ గతంలో ఇండియన్ పీనల్ కోడ్‌లో కొన్ని చట్టాలు మాత్రమే ఉండేవని, తర్వాత వాటి సంఖ్యను పెంచుతూ పలు చట్టాలను చేర్చారన్నారు. ఆర్గనైజింగ్ నేరాలు సమాజాన్ని ప్రభావితం చేస్తాయన్నారు. ముఖ్యంగా పాత్రికేయులకు ఆధునిక చట్టాలపై అవగహన ఉండాలని సూచించారు. అడిషనల్ డైరెక్టర్ జనరల్ రాజేంద్ర చౌదరి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఇన్ఫర్మేషన్ ఆఫీసర్ వై.ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

పన్ను మోసం.. చెరో సగం!

అనగనగా.. ఒక ఫేక్ కంపెనీ..
ఆ ఫేక్ కంపెనీకి ఒక ఫేక్ ఓనర్..
ఆ ఫేక్ ఓనర్.. ఆ ఫేక్ కంపెనీ పేరుతో వ్యాపార లావాదేవీలు చేసినట్లు ఫేక్ ఇన్‌వాయిస్‌లు సృష్టిస్తాడు.
ఆ ఇన్‌వాయిస్‌లని జీఎస్టీ ఆఫీస్‌లో సమర్పించి.. ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్‌ను కొట్టేస్తాడు.
ఆ ఫేక్ కంపెనీ ఓనర్‌కి ఈ సలహా ఇచ్చింది మాత్రం.. జీఎస్టీ ఉద్యోగే.!
ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ రాగానే ఆ ఫేక్ ఓనర్.. ఈ ఒరిజినల్ ఉద్యోగి కలిసి చెరో సగం పంచేసుకుంటారు.
ఇది కథ కాదు.. జీఎస్టీ పరిధిలో నిత్యం జరిగే మోసం. పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న నకిలీ కంపెనీలను గుర్తిస్తున్నా.. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను మాత్రం ఏదో ఒక రూపంలో మోసగాళ్లు మోసం చేస్తూనే ఉన్నారు. అయితే వీరికి సాయం చేస్తోంది స్టేట్, సెంట్రల్ జీఎస్టీ కార్యాలయాల్లోని సిబ్బంది కావడం విచారించదగ్గ విషయం. అందుకే ఇంటి దొంగని ఈశ్వరుడైనా పట్టుకోలేరంటారు.



- ఫేక్ కంపెనీలతో నకిలీ ఇన్‌వాయిస్‌ల సృష్టి
- ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ సొంతం చేసుకునేందుకు వ్యాపారుల కుయుక్తులు
- సహకరిస్తున్న జీఎస్టీ సిబ్బంది
- ఇన్‌పుట్ వచ్చిన వెంటనే చెరో సగం పంచుకుంటున్న వైనం
- జీఎస్టీ విశాఖ డివిజన్ పరిధిలో రూ.కోట్లలో మోసాలు

సాక్షి, విశాఖపట్నం: ఇంటర్ చదివి జులాయిగా తిరిగే ఓ యువకుడు రెండేళ్ల కిందట చిన్న చిన్న వ్యాపార సంస్థల్లో పని చేసి.. జీఎస్టీలో లొసుగులను పసిగట్టాడు. వైజాగ్, రాజమండ్రి, విజయవాడ, గుంటూరు, హైదరాబాద్ మొదలైన నగరాల్లో ఒకటి కాదు.. రెండు కాదు ఏకంగా 20 ఫేక్ కంపెనీలు సృష్టించి పన్ను మోసాలకు పాల్పడేందుకు ఎత్తుగడ వేశాడు. 20 నకిలీ సంస్థలను ఏర్పాటు చేసి బిల్లులు జనరేట్ చేశాడు. ఈ సంస్థల నుంచి దేశంలోని వివిధ నగరాల్లోని కంపెనీలకు సరకు లావాదేవీలు జరిపినట్లు రూ.265 కోట్ల మేర నకిలీ ఇన్‌వాయిస్‌లు రూపొందించాడు. వీటిని ఉపయోగించుకుని రూ.31 కోట్ల ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్‌ని సొంత చేసుకునేందుకు ప్రయత్నించాడు. అప్పటికే 10 కోట్ల వరకు క్రెడిట్ చేసుకున్న యువకుడి వ్యవహారం చివరి నిమిషంలో జీఎస్టీ విజిలెన్స్ తనిఖీల్లో బట్టబయలైంది.

రూ.200 కోట్లకు పైగా రికవరీ.. అయినా..

నకిలీ ఇన్‌వాయిస్‌ల పేరుతో మోసాలు జరుగుతూనే ఉన్నాయి. ఫేక్ కంపెనీల పేరుతో పన్నుల చెల్లింపును ఎగవేసేలా వ్యూహాలను అమలు పరుస్తున్నారు. కొన్ని కంపెనీలు.. చిన్న చిన్న తప్పులతో దొరికిపోతుంటే.. చాలా మంది వ్యాపారులు మాత్రం దర్జాగా ఇన్‌పుట్ క్రెడిట్‌ని తమ ఖాతాల్లోకి జమ చేసుకుంటున్నారు. డైరెక్టర్ జనరల్ ఆఫ్ జీఎస్టీ ఇంటెలిజెన్స్ విశాఖపట్నం జోనల్ యూనిట్ పరిధిలో దాదాపు 350కి పైగా నకిలీ కంపెనీల గుట్టురట్టు చేసి రూ.200 కోట్లకు పైగానే రికవరీ చేశారు. అయినా ఫేక్ కంపెనీలు నకిలీ ఇన్‌వాయిస్‌లతో రెచ్చిపోతున్నాయి.

రాష్ట్ర పన్నుల శాఖలోనూ...

కేవలం సెంట్రల్ జీఎస్టీ పరిధిలోనే కాకుండా.. రాష్ట్ర పన్నుల శాఖ పరిధిలోనూ ఫేక్ ఇన్‌వాయిస్‌ల పేరుతో మోసాలు జరుగుతున్నాయి. ముఖ్యంగా తుక్కు పరిశ్రమలు, సిమెంట్, స్టీల్ వ్యాపారులు, సిగరెట్లు, విదేశాల నుంచి దిగుమతి చేసుకున్న వస్తువుల విక్రయ వ్యాపారులు, వస్త్ర దుకాణాలు.. ఇలా చాలా వ్యాపారాల పేరుతో నకిలీ కంపెనీలున్నాయి. వాటిని కనిపెట్టడం పన్నుల శాఖ అధికారులకు కత్తిమీద సాముగా మారింది. వందల కోట్ల రూపాయలు కాజేస్తున్నా.. వారిని పట్టుకోలేకపోతున్నారు. ప్రతి బిల్లుని నిశితంగా పరిశీలించాల్సిన రాష్ట్ర పన్నుల శాఖ విశాఖ డివిజన్ పరిధిలోని అధికారులు, సిబ్బంది.. తూతూ మంత్రంగా పరిశీలిస్తుండటంతో మోసాలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి.

సిబ్బంది చేతివాటంతోనే..

స్టేట్ జీఎస్టీ విశాఖ డివిజన్ పరిధిలోని సర్కిళ్లతో పాటు ప్రధాన కార్యాలయంలోని కొందరు సిబ్బంది ఫేక్ కంపెనీలు సృష్టిస్తున్న వ్యాపారులతో చేతులు కలుపుతున్నట్లు సమాచారం. ఫేక్ ఇన్‌వాయిస్‌లను పక్కాగా ఎలా తయారు చేయాలి? వాటిని ఏ సమయంలో సమర్పిస్తే.. ఎవరికీ అనుమానం రాకుండా పూర్తిస్థాయిలో వెరిఫికేషన్ జరగదు.. ఎలా ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్‌ని సొంతం చేసుకోవచ్చు.. ఇలా సమగ్ర వివరాలతో స్కెచ్ వేసి.. తూ.చ తప్పకుండా అమలయ్యేటట్లుగా ప్లాన్ చేస్తున్నారు. ఫైల్స్ తమ దగ్గర నుంచే వెళ్లేలా చూసుకుని.. ఎవరికీ అనుమానం రాకుండా ఇన్‌పుట్‌ని కొట్టేస్తూ.. చెరి సగం పంచేసుకుంటున్నారు. స్టేట్ ట్యాక్స్ కార్యాలయంలోని కొందరు సిబ్బందితో పాటు సూర్యాబాగ్, సిరిపురం, ద్వారకానగర్, డాబాగార్డెన్స్, కురుపాం మార్కెట్, గాజువాక, అనకాపల్లి, చినవాల్తేరు సర్కిళ్ల పరిధిలో ఈ తరహా నకిలీ ఇన్‌వాయిస్‌లు ఎక్కువగా వస్తున్నాయి. వీరికి మోసగాళ్లకు ఆయా సర్కిళ్ల పరిధిలో కొందరు ఉద్యోగులు సహకారం అందిస్తూ.. ప్రభుత్వ ఖజానాకు కన్నం వేస్తున్నారు. దీని వల్ల జీఎస్టీ వసూళ్లు పెరుగుతున్నా.. ఇన్‌పుట్ క్రెడిట్ కుంభకోణంతో ఖజానాకు చిల్లు పెడుతున్నారు. ఉన్నతాధికారులెవ్వరూ పూర్తి స్థాయిలో దృష్టి సారించకపోవడంతో ఆకాశమే హద్దుగా చెలరేగిపోతున్నారు.

రోడ్డు ప్రమాదంలో తాపీ మేస్త్రి మృతి

యలమంచిలి రూరల్ : యలమంచిలి మండలం లక్కవరం గ్రామానికి సమీపంలో 16వ నంబరు జాతీయ రహదారిపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నక్కపల్లి మండలం దోసలపాడు గ్రామానికి చెందిన తాపీ మేస్త్రి పల్లా లక్ష్మణరావు(42) దుర్మరణం చెందాడు. నక్కపల్లి మండలం దోసలపాడు, ముకుందరాజుపేటకు చెందిన పల్లా లక్ష్మణరావు, కోర్ని రమణలు, డెంకాడ గ్రామానికి చెందిన ఉద్దండం గిరీష్,కాపారపు నాగేంద్రలు రెండు ద్విచక్ర వాహనాలపై గాజువాకలో తాపీ పని కోసం బయలుదేరారు. మార్గమధ్యంలో యలమంచిలి మండలం లక్కవరం వద్దకు చేరుకోగానే ఓ లారీని తప్పించబోయి రెండు ద్విచక్ర వాహనాలు ఒకదానినొకటి ఢీకొట్టి బోల్తా పడ్డాయి. ఈ ప్రమాదంలో దోసలపాడుకు చెందిన పల్లా లక్ష్మణరావు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. మరో ద్విచక్ర వాహనం నడుపుతున్న ఉద్దండం గిరీష్ ఎడమ చేయి విరిగిపోయింది. అతడిని మెరుగైన చికిత్స కోసం విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. మృతుడి బంధువు పక్కుర్తి నాగేశ్వర్రావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు యలమంచిలి రూరల్ ఎస్ఐ సైలా సింహాచలం తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



అప్పలనాయుడు మృతదేహం

కోటవురట్ల : మరో కొద్ది నిమిషాల్లో ఇంటికి క్షేమంగా చేరాల్సిన వ్యక్తి రోడ్డు ప్రమాదంలో తిరిగిరాని లోకాలకు వెళ్లిపోయాడు. కుటుంబ పెద్దను కోల్పోవడంతో ఆ కుటుంబం ఆసరాను కోల్పోయింది. వివరాల్లోకి వెళితే యండపల్లి గ్రామంలో బుధవారం చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదంలో అదే గ్రామానికి చెందిన గుడివాడ అప్పలనాయుడు(46) మృతి చెందాడు. పొలం నుంచి సైకిల్‌పై ఇంటికి వెళుతూ మెయిన్‌రోడ్డు నుంచి ఊళ్లోకి వెళ్లే రోడ్డుకు మలుపు తిరుగుతుండగా వెనక నుంచి వేగంగా బైక్‌పై వచ్చిన సన్యాసిరాజుపాలేనికి చెందిన గెంజి కన్నబాబు ఢీకొట్టాడు. ఈ ఘటనలో అప్పలనాయుడు తలకు తీవ్ర గాయం కావడంతో ముక్కు చెవుల నుంచి రక్తస్రావమైంది. నర్సీపట్నం ఆస్పత్రికి తరలించేందుకు ఆటో ఎక్కిస్తుండగా ప్రాణాలు కోల్పోయాడు. మృతునికి భార్య అచ్చియ్యమ్మ, ఇద్దరు పిల్లలు కాగా భార్య అచ్చియ్యమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించినట్టు ఎస్ఐ రమణయ్య తెలిపారు.